
నీ వెనుక నేను
(నవ్య వీక్లీ ధారావాహిక)
గొర్లి శ్రీనివాస రావు

# నీ వెనుక నేను

(నవ్యవీక్లి ధారావాహిక)

గొర్లి శ్రీనివాస రావు

# నీ వెనుక నేను

## 1

ఆకాశానికి భూమికి ఏకధారగా వర్షం కురుస్తోంది.

ఉండుండి ఆకలిగొన్న సింహం అసహనంగా గర్జించినట్లు ఆకాశం భీకరంగా ఉరుముతోంది.

విశాఖ పట్టణం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై డిజిటల్ క్లాక్ సమయం అర్ధరాత్రి కావస్తోంది అని తెలియచేస్తోంది.

రొద చేసుకుంటూ ప్లాట్‌ఫారం పైకి వచ్చి ఆగింది ఒక రైలుబండి. రావాల్సిన సమయం కంటే నాలుగు గంటలు లేటుగా వచ్చిన ఆ రైలులోని ప్రయాణీకులు ప్లాట్‌ఫారంపై రైలు ఆగి ఆగకుండానే తోసుకుని తోసుకుని సామానుతో సహా దిగడం మొదలు పెట్టారు.

ఆమె అందరికంటే ఆఖరున దిగింది. చీరకొంగు మెడపై నించి భుజాల మీదుగా ముందుకి చుట్టుకుంది. ఆమె ఒళ్ళంతా చీరతో చుట్టుకుని వున్నా ఒకసారి ఆమెను చూసిన వారు ఆగి మళ్ళీ చూసే ఆకర్షణ ఆమె ప్రతి కదలికలోనూ తొణికిసలాడుతోంది. చేతిలో ఉన్న చిన్న బాగేజిని వీల్స్ పై లాగుతూ బయటకు నడిచింది. బెదురు చూపులతో చుట్టూ మాటి మాటికి చూసుకుంటూ నడిచింది. గుంపులుగా నడుస్తున్న జనాలను తప్పించుకుంటూ జాగ్రత్తగా నడిచింది.

విపరీతమైన గాలులు వీస్తూ కురుస్తున్న కుంభవృష్టికి స్టేషన్ లోపల బయట కూడా హటాత్తుగా కరెంట్ పోయింది. అప్పటి వరకూ ప్రకాశవంతంగా వున్న స్టేషన్ ఆవరణ, ప్లాట్‌ఫారంలలో చిక్కటి చీకటి అలుముకుంది. వెంటనే తమ తమ మొబైల్స్ తీసి యథాశక్తి వెలుతురు విరజిమ్మారు ప్రయాణీకులు. మిణుగురు పురుగులు రెక్కలు విప్పి ఎగిరితే విరిసిన వెలుతురు తునకల్లా ప్రయాణీకుల చేతుల్లోని మొబైల్ ఫోన్ల నుంచి వచ్చే వెలుతురు, జల్లెడలోంచి వెన్నెల కాంతులు కురిసినట్టు వెల్లివిరిసాయి.

కరెంట్ పోయి చీకటి అలుముకోగానే ఆమె ఒక్క క్షణం నడక ఆపి భీతహరిణేక్షణలా తడబడుతూ చూసింది. కాని అక్కడక్కడా మొబైల్ ఫోన్ల కాంతులు ప్రకాశించడంతో తేరుకుని స్టేషన్ వెలుపలికి నడిచింది.

ఒక వైపు వర్షం, మరో వైపు చీకటి. ఆటోలకు, టాక్సీలకు డిమాండ్ పెరిగిపోయింది. నోటికి వచ్చినంత డిమాండ్ చేస్తూ నచ్చిన రూట్‌లోనే వెళ్తామంటూ ప్రయాణీకులతో బతిమాలించుకుంటున్నారు ఆటోవాలాలు.

ఆమె ఒక పక్కగా నుంచుని బాగ్‌లో నుంచి తన మొబైల్ ఫోన్ తీసింది. నెంబర్ డయల్ చేసి చెవికి ఆనించుకుంది. ఫోన్ రింగయింది. కాని అవతల వ్యక్తి స్పందించలేదు. ఆమె ముఖంలో మరింత ఆందోళన కనబడింది. వణుకుతున్న చేతులతో మళ్ళీ కాల్ చేసింది.

'ఏటమ్మా, ఏడకెళ్ళాలి' అంటూ దగ్గరగా వచ్చాడు ఒక ఆటో వాడు. చొక్కా పైన లూజుగా ఒక పాత జర్కిన్ వేసుకున్నాడు. చింపిరి జుత్తు నీళ్ళతో తడిచి దూరానికి వాసన వస్తోంది. వాడు నోరు తెరిచి ఆమె వైపు చూస్తూనే వున్నాడు. ఆమె వాడి వైపు కోరగా చూసి ఫోన్‌పై దృష్టి పెట్టింది. రెండో సారి కూడా ఫోన్ పూర్తిగా రింగయింది కాని స్పందన లేదు.

''ఏటి ఎవరూ నేరా'' అన్నాడు ఆటోవాడు చుట్టూ చూస్తూ.

వాడి మాటలకు ఆమె గుండెలు దడదడలాడాయి. గబగబా తన బాగేజీ లాక్కుని మళ్ళీ ప్లాట్‌ఫారం వైపు వెళ్ళింది. అదే ఆమె చేసిన పొరపాటు! అలమంద నుంచి లేగదూడ వేరు పడితే వేటకుక్కలు వెంటపడినట్లు మరో ఇద్దరు మృగాళ్ళు ఆమె వెనకగా వెళ్ళారు.

ఆమెతో ప్రయాణం చేసి మాట కలపడానికి ప్రయత్నం చేసి భంగపడిన చదువుకున్న యువకులు, నడివయసు అడ్డం పెట్టుకుని చొరవ తీసుకోవాలని చూసే ముసుగులు తొడుక్కున్న మర్యాదస్తులు, ఇంకా కొందరు ఆడవాళ్ళు కూడా ఆమెను, ఆమె వెంట పడుతున్న 'శునకాలను' చూసారు. కాని ఏ ఒక్కరు ఆమెకు ఆసరా ఇవ్వడానికి చొరవ చూపలేదు!

వడి వడిగా నడుస్తూ డ్యూటీలో వున్న స్టేషన్ మాస్టర్ రూమ్ దగ్గరకు వెళ్ళింది ఆమె. తెల్లటి యూనిఫారంలో తన ముందు వున్న పెద్ద పానెల్ పైన మీటలను సరైన పొజిషన్లలో పెడుతూ మధ్య మధ్య వస్తున్న కంట్రోల్ ఫోన్లలో మాట్లాడుతూ బిజీగా వున్నాడు స్టేషన్ మాస్టర్. ఆమె తిన్నగా అక్కడకు వెళ్తుందని ఊహించని ఆ మృగాళ్ళు కాస్త దూరంగా నిల్చుని ఆమె వైపే చూస్తూ తమలో తాము మాట్లాడుకోసాగారు.

''గుంట బలేగుంది గురూ. హైక్లాసు గుంటే. కాంతం కంపినీకి తీసికెళ్ళి ఒగ్గేస్తే కాసులు కురిపించేస్తది'' అన్నాడు ఒకడు, కావాలనే కొంచెం గట్టిగా ఆమెకు వినపడే టట్లుగా!

''ఒల్లకోరా! అడ్రసు కనుక్కుని ఇంటి దగ్గర ఒగ్గిద్దారి'' అన్నాడు మరొకడు దయగల మనిషిలా ఫోజుకొడుతూ!

వాళ్ళ మాటలు ఆమెలో విపరీతమైన భయాన్ని రేకెత్తించాయి. అంత చలిగాలులు వీస్తున్న వేళ కూడా ఆమె అలసిన మోము స్వేదంతో తడిచిపోయింది. పొడారిపోయిన గొంతుని ఎలాగో స్వాధీన పరుచుకుని, ''ఎక్స్‌క్యూజ్‌మీ సర్'' అని అంది ఆమె.

ఆమె గొంతు విని వెనక్కి తిరిగి చూసి చేత్తో ''ఒక్క క్షణం'' అని సైగ చేస్తూ తను చేస్తున్న పనిని పూర్తి చేసాడు డ్యూటీ మైండెడ్‌గా వున్న స్టేషన్ మాస్టర్. తన పని సక్రమంగా పూర్తి చేసాను అని తృప్తి చెందాక ''ఎస్ ఏం కావాలి మీకు?'' అని అడిగాడు ఆమెని.

''నేను భీమిలిలోని ముక్తేశ్వరస్వామి ఆశ్రమానికి వెళ్ళడానికి వచ్చాను. ఈ ట్రైన్ లేట్ అవడం వలన ఆశ్రమం నుంచి నాకోసం రావాల్సిన మనిషి కాంటాక్ట్ కావడం లేదు. నాకు హెల్ప్ చేయగలరా! ప్లీజ్'' అంది.

''భీమిలి ఈ తుఫాన్‌లో ఎలా వెళ్తారు. మీకు రిటైరింగ్‌రూమ్ ఇద్దామనుకున్నా అవకాశం లేదు. అన్ని రూమ్‌లు ఆక్యుపేషన్‌లో వున్నాయి'' అన్నాడు స్టేషన్ మాస్టర్ తన అశక్తతను వెలిబుచ్చుతూ!

''ప్లీజ్ సర్, ఎలాగైనా సాయం చేయండి. పోనీ తెల్లారే వరకు ఈ గదిలో ఒక పక్కన కూర్చుంటాను'' ప్రాధేయపడింది ఆమె.

''అమ్మో రూల్స్ ఒప్పుకోవు. అందునా మీరు ఆడవారు. నా పై ఆఫీసర్లు తనిఖీకి వస్తే ఉద్యోగం ఊడిపోతుంది'' అన్నాడు స్టేషన్ మాస్టర్ సీరియస్‌గా.

తను ఉన్న అసహాయస్థితికి ఆమె మనసు దుఃఖంలోమునిగిపోయింది. మళ్ళీ మళ్ళీ బతిమిలాడడానికి ఆమె అభిజాత్యం ఒప్పుకోలేదు. తన కంట కురుస్తున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ తల వంచుకుని వెనుతిరిగింది ఆమె.

ఆశ్రయం కోసం వచ్చిన ఒంటరి స్త్రీకి ఏమీ సాయం చేయలేని తనను తాను తిట్టుకున్నాడు ఆ స్టేషన్ మాస్టర్. ఆమె వెళ్తున్న వైపు చూసి నిట్టూర్చాడు. పగటి పూట రైలు దిగి మోసగాళ్ళ వలలో పడి తమ మాన ప్రాణాలను కోల్పోయిన ఒంటరి స్త్రీలు గుర్తుకు వచ్చి, ఈ అర్ధరాత్రి ఈమె ఒంటరిగా ఎవరి చేతుల్లో చిక్కుతుందో అని, మనసులో సంఘర్షణ పడుతుంటే ప్లాట్‌ఫారం పై ఖాళీగా వున్న సఫాయివాలాల రూమ్ గుర్తుకు వచ్చింది అతనికి. ఆమెను వెనక్కి పిలిచి ఆ రూమ్ తెరిచి ఈ రాత్రికి ఆమెను అందులో ఉండనిద్దాం అనుకున్నాడు. తన గది నుంచి బయటకు వచ్చి ఆమెను పిలుద్దామని చూసాడు.

స్టేషన్ మాస్టర్ రూమ్‌లో నుంచి బయటకు వచ్చిన ఆమెకు ఒక వైపు గుంటనక్కల్లా తన కోసం కాచుకుని వున్న మృగాళ్ళు మరో వంక చేతిలోని లాఠీతో ప్లాట్‌ఫారం పై వున్న బెంచీలపై పడుకుని వున్న బిచ్చగాళ్ళను అదలిస్తున్న రైల్వే పోలీసు కనిపించాడు.

యూనిఫారం వేసుకుని బూట్లు టకటకలాడించుకుంటూ నడుస్తున్న పోలీసుని చూసిన ఆమెకు గుంటనక్కల వల్ల కలిగిన భయం కంటే ఎక్కువ భయం కలిగింది! ఒక్క క్షణం కూడా అక్కడ ఆగకుండా బాగేజీ లాగుకుంటూ మళ్ళీ బయటకు నడిచింది. ఆమె పోలీసుని చూసి భయపడడం ఆ గుంటనక్కల దృష్టిలో పడింది.

''ఒరే ఇది పెద్ద కేసు నాగుండెసె'' అన్నాడు బీడీ దమ్ము లాగుతూ ఒకడు.

''లగెత్తు సాయం కావాలా ఏంటో అడుగుదారి'' అన్నాడు త్వరత్వరగా అడుగులు వేస్తూ జర్కిన్ వేసుకున్న ఆటోవాడు.

''ఏటమ్మా, మేం మనుసులం కాదా? తెల్ల బట్టలేసుకుంటేనా మడుసులా! కష్టం సుకం తెలిసినోల్లం. నీకేం బయంనేదు. నువ్వెక్కడకెల్లాలో సెప్తే మేం తీసుకెల్లి ఒగ్గేస్తాం. ఏటంటావ్'' అంటూ ఆమెను మాటలతో మభ్యపెట్టడానికి సిద్ధపడ్డాడు ఆటో వాడు. వాడి వెంట ఉన్న వాళ్ళు కూడా ఆమెకు రెండు వైపులా వచ్చి కవర్ చేసారు.

ఆమె చుట్టూ వున్న జనాలను, ఆమె పోలీసుని చూసి భయపడటం గమనించిన స్టేషన్ మాస్టర్‌కి ఆమె పైన కొంచెం అనుమానం వచ్చింది. ఆమెను పిలిచి తాను రూమ్ ఇస్తే, ఆ రూమ్‌లో జరగరాని పనులు జరిగితే దానికి తనే బాధ్యుడు అవుతాడు అని గుర్తుకు వచ్చింది. ఆమె ఎంత నీతి నిజాయితీగా వుంటుందో తెలియరాలేదు. కంటికి కనిపించేవన్నీ నమ్మలేం. అన్నిటికి ఆ భగవంతుడే కర్త అనుకుని సమాధానపడి వెనక్కి వెళ్ళి తన పనిలో తాను మునిగిపోయాడు.

తనను చుట్టుముట్టిన మృగాళ్ళను అదిలించడానికి వృధా ప్రయత్నాలను చేసింది ఆమె. ''నాకు భయం లేదు. నా కోసం మా వాళ్ళు వస్తున్నారు. మీరు వెళ్ళిపొండి'' అని గొంతు పెంచి చెప్పాలనుకుంది. కాని శబ్దం నీరసంగా వచ్చింది.

''ఏటమ్మా ఇంత రాత్రప్పుడు వాళ్ళెక్కడ నుంచి వత్తారు. ఏ పేటలో వుంటారు మీ వాళ్ళు. గ్నానాపురాన్నా, కంచరపాలాన్నా'' హేళనగా అడిగాడు ఒకడు.

''నన్ను వదిలి వెళ్ళండి, ప్లీజ్, మీకు పుణ్యాం వుంటుంది!'' బ్రతిమలాడింది ఆమె.

ఆమె దైన్య స్థితికి వాళ్ళల్లో కోరిక మరింత రేగిపోయింది. పిట్ట చేతికి దొరికినట్టే, అని నమ్మకం చిక్కింది. చొరవ ఎక్కువయింది. ఒకడు ఆమె చేతినుంచి బాగేజీ లాక్కున్నాడు! బహువచనం నుంచి ఏకవచనంలోకి మారింది సంబోధన!

''ఒల్లకో! మాతో వస్తే నీకే మంచిది. ఏటి ఎవరికో ఒగ్గేసి యెళ్ళిపోడానికి యెర్రోల్ల మనుకున్నావా! నిన్నెక్కడికి తీసుకెల్లాలో చెప్పు. జాగత్తగా దింపేసి యెల్తాం''అన్నాడు ఆటోవాడు తడిజుత్తుని యెడమ చేత్తో వెనక్కి తోసుకుని కుడిచేత్తో ఆమె చేయి పట్టుకుంటూ.

పిచ్చికుక్క మీదకు వస్తుంటే భయపడినట్లు, బెదిరింది ఆమె. అసంకల్పితంగా చేతిని వెనక్కి లాక్కుంటూ గట్టిగా అరిచింది. ''నాకెవరూ సాయం అక్కర్లేదు వెళ్ళండి'' అంది గట్టిగా!

ఆమెలో అంత కోపం చూసి వాళ్ళల్లో కూడా పట్టుదల హెచ్చింది. ''బాగ్ తీసుకెళ్ళి ఆటోలో పెట్టరా. ఇది ఎలా రాదో నాను సూస్తాను'' అన్నాడు ఆటోవాడు కోపంగా!

అంతలో తూలుకుంటూ వచ్చాడు కొద్దిగా లావుగా పొట్టిగా వున్న ఒక వ్యక్తి. ''ఒరే ఆ తల్లిని ఒగ్గేయండిరా!'' అన్నాడు అక్కడ వున్న వాళ్ళను ఉద్దేశించి. ఆ వ్యక్తి రంగంలోకి రాగానే కొంచెం చల్లబడ్డారు ఆమెను వేధిస్తున్న మృగాళ్ళు.

ఆమె బాగ్‌ని తను లాక్కుని ''రామ్మా, ఎల్దాంరి! సాములోరి ఆశ్రమం నుంచి నాకు ఫోన్ సేసి సెప్పినారు నిన్ను తీసుకురమ్మని'' అన్నాడు. ఆశ్చర్యంగా తన వైపు చూస్తున్న ఆమెతో.

దేవుడిలా సమయానికి వచ్చి తనను కాపాడిన ఆ అపరిచిత వ్యక్తికి మనసులోనే నమస్కరించింది ఆమె. మౌనంగా అతని వెంట నడిచింది. స్టేషన్ ముందు వున్న టాక్సీ స్టాండ్ దగ్గరకు వెళ్ళేటప్పుడు తల తడిచిపోకుండా చీర కొంగు తల పై నుంచి కప్పుకుంది.

జోరున కురుస్తున్న వర్షాన్ని లెక్కచేయకుండా నడిచి, ఆమెను తన టాక్సీ దగ్గరకు తీసికెళ్ళి, ఆమె బాగ్‌ను తన పక్క సీటులో వుంచి, ఆమెను వెనక సీటులో కూర్చోమని చెప్పాడు.

''నన్ను తలుపులు అంటారు తల్లీ'' అన్నాడు డ్రైవింగ్ సీటులో సర్దుకుని కూర్చుంటూ. మౌనంగా తల ఊపింది ఆమె. కొన్ని క్షణాల వరకు, తను వున్న భయంకర సన్నివేశం ఆమె మనసుని ఇంకా భయపెడుతూనే వుంది. కళ్ళల్లో బెరుకు ఇంకా దాగి వుంది.

''బండి లేటయిపోనాది తల్లీ. నేను నీ కోసం ఇక్కడే కాసుకుని కూకున్నా'' అన్నాడు తలుపులు.

''మీకు ఆశ్రమం నుంచి ఫోను ఇప్పుడు రాలేదా?'' అడిగింది ఆమె.

''సెప్పాను కదు తల్లీ! ఆశ్రమం నుంచి సాములోరి మనిసి ఈ బండికి నువ్వొత్తావని, నీకు ఊరు కొత్తని సెప్పినారు. దగ్గరుండి జాగెత్తగా ఎంటపెట్టుకుని రమ్మన్నారు'' అన్నాడు టాక్సీ స్టార్ట్ చేసి ముందుకి పోనిస్తూ.

అతను నోరు తెరిచి మాట్లాడుతుంటే వచ్చిన వాసన ఆమెకు అతను సేవించిన దేశవాలీ మద్యం గురించి హెచ్చరికలు చేసింది. తను ఆపద తప్పించుకున్నానని అని ఆనందిస్తున్న ఆమెకు మళ్ళీ పూర్తి స్థాయిలో భయం మొదలైంది.

నక్కలను తప్పించుకుందామని ప్రయత్నించి పులి వుంటున్న గుహలోకి తలదాచు కోవడానికి వెళ్ళానా అని మనసులో తనను తాను ప్రశ్నించుకుంది.

మళ్ళీ ముఖమంతా స్వేదం చిందింది. గొంతు పొడారిపోయి మాట పెగల్లేదు ఆమెకు.

ఏమీ మాట్లాడకుండా కూర్చుని వున్న ఆమెను మాటల్లో పెట్టాలని చూసాడు తలుపులు. ఆమె ఎక్కడ నుంచి వస్తుందో అడిగాడు. సాములోరు ఎలా తెలుసో అడిగాడు. ఎప్పుడైనా భీమిలి వచ్చావా అన్నాడు. ఎవరూ తోడు లేకుండా ఎలా వచ్చావు అని అడిగాడు.

అతను అడిగిన ప్రశ్నలకు ఏదో దాటవేత సమాధానాలు చెప్తూ నిరంతరంగా తన మొబైల్ ఫోన్ నుంచి కాల్స్ చేస్తూనే వుంది ఆమె. కొంచెం సేపు ఆమెను గమనించిన తర్వాత ''ఏటి తల్లీ ఆశ్రమంలో ఫోన్ తియ్యటనేదా?'' అన్నాడు.

అతని ప్రశ్న ఆమెకు మరింత ఆందోళన కలిగించింది.

కారు వేగంగా వెళ్తోంది. వీధి దీపాలు కూడా వెలగని తుఫాన్ రాత్రికి కారు ఎటు వెళ్తున్నదో కూడా కనబడడం లేదు. కనబడినా ఆమె చేయగలిగింది కూడా లేదు.

ఈదురు గాలులకు రోడ్డుకి ఇరువైపులా వున్న చెట్లు జడల భూతాల్లా ఊగుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల తెరిపి లేకుండా వర్షం కురుస్తూనే వుంది.

తలుపులు తనను మోసగించి ఎక్కడికో తీసుకునిపోతున్నాడా అని సందేహం కలిగింది ఆమెకి. కాని ఆశ్రమం గురించి స్వామీజీ గురించి అతనికి ఎలా తెలుసు. తను అక్కడికి వెళ్ళాల్సి వుంది అని అతనికి ఎలా తెలిసింది. వెనకగా ఏమైనా వెహికల్స్ వస్తున్నాయా అని చూసింది. ఒక ఆటో వస్తున్నట్టు కనిపించింది. దానితో ఆమె సందేహం మరింత దృఢపడింది. ఆటోవాడి గాంగ్‌కి ఈ తలుపులుకి సంబంధం వుండి వుంటుంది.

అందరూ కలిసి తనను ఇబ్బంది పెడుతున్నప్పుడు తలుపులు హఠాత్తుగా ప్రత్యక్షమవడం అంతా ముందుగా వాళ్ళు వేసుకున్న ప్లాన్ అయి వుంటుంది. ఆ సమయంలో అతను దేవుడిలా వచ్చాడు అని తలచింది. కాని ఇప్పుడు ఆలోచిస్తే అతను తనను ఎత్తుకుని వెళ్ళిపోతున్న రాక్షసుడిలా కనిపిస్తున్నాడు. ఎంత వంచన అనుకుంది ఆమె!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2353**

* * *